ప్రజలకు ఆర్థిక భరోసా లక్ష్యంగా ప్రభుత్వ పాలన

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- జల్లికొమ్మరలో ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం


ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

గణపవరం (నిడమర్రు): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థిక భరోసా కల్పిస్తూ వారంతా సుఖసంతోషాలతో ఉండేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం జల్లికొమ్మరలో వరుసగా రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందడిగా జరిగింది. దీంతో ఈ కార్యక్రమం నియోజకవర్గంలో 194వ రోజుకు చేరుకుందని మండల కన్వీనర్ దండు రాము తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజల్లోకి వెళ్లి ధైర్యంగా ప్రతి కార్యకర్త చెప్పగలుతున్నారన్నారు. కుల మతాలు, పార్టీలకు అతీతంగా అర్హత ఉండి దరఖాస్తు చేసుకున్న ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకే గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా 310 గడపల వద్దకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి వారికి ఇప్పటి వరకూ ప్రభుత్వ పరంగా అందిన పథకాల వివరాల పత్రాలను పంపిణీ చేసారు. వారు చెప్పిన సమస్యలు తక్షణం పరిష్కరించేలా గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలు జారీ చేసారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు మద్దతు తెలిపాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుబాబు వెంట ఎంపీపీ దండు రాము, సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం, గ్రామపార్టీ అధ్యక్షులు, ఆర్‌బీకే చైర్మన్ కురెళ్ల త్రిమూర్తులు, సొసైటీ అధ్యక్షుడు మద్దాల అర్జునరావు, ఉప సర్పంచ్ తంగెళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ బుద్దాల వెంకటేశ్వరరావు ఎంపీడీవో జ్యోతిర్మయి, పీఆర్ ఏఈ శ్రీనివాస్, సెక్రటరీ సరళ తదితరులున్నారు.

ఉద్యోగాల క్రమబద్ధీకరణపై వైఎస్సార్‌టీఎఫ్ నేతల హర్షం

దెందులూరు: రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి క్రమబద్ధీకరణ చేయడం స్వాగతిస్తున్నామని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీజీ కెనడీ, జిల్లా కార్యదర్శి తోట ఎడ్వర్డ్, మండల నాయకులు రాబర్ట్, దాసు హర్షం వ్యక్తం చేశారు. గురువారం దెందులూరులో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీజీ కెనడీ నివాసంలో నాయకులు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా ఆయన స్ఫూర్తితో ఇచ్చిన మాటను తప్పకుండా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వైఎస్సార్‌టీఎఫ్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, బంధువులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతగా మద్దతుగా ఉంటారని యూనియన్ పరంగా, వ్యక్తిగతంగా ఈ నిర్ణయం తమకెంతో సంతోషంగా ఉందని పీజీ కెనడీ అన్నారు.

క్లుప్తంగా

చనిపోయిన వారి ఓట్లు తొలగిస్తాం


దెందులూరు గౌడవీధిలో ఓట్ల పరిశీలనలో పాల్గొన్న బీఎల్‌ఓ పీ.శివకుమార్

దెందులూరు: స్థానిక గౌడవీధిలోని బూత్ పరిధిలో 42 మంది ఓటర్లు చనిపోవడంతో వారి ఓట్లు తొలగిస్తామని దెందులూరు బూత్ లెవల్ ఆఫీసర్ పీ.శివకుమార్ అన్నారు. ముందుగా కుటుంబ సభ్యులు, బంధువుల ద్వారా నిర్ధారించి మండల ఎన్నికల అధికారికి నివేదిక అందజేశామని ఆయన అన్నారు. గురువారం ఓట్ల పరిశీలనలో భాగంగా గౌడవీధిలో కొత్తపల్లి జ్యోతి నివాసంలో అర్హులైన ఇద్దరికి ఓటు హక్కు దరఖాస్తులు పూర్తి చేశారు. ఈ నెల 21వ తేదీ వరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓట్ల పరిశీలన నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది వచ్చినప్పుడు ప్రతిఇంట్లో కుటుంబసభ్యులు వివరాలు తెలియజేసి సహకరించాలని కోరారు.

హుండీల ఆదాయం రూ.1.89 లక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పత్తేబాదలోని చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో హుండీల ఆదాయం రూ.1,89,840 లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు తెలిపారు. ఈ ఆదాయం 156 రోజులకు భక్తులు సమర్పించుకున్నారని చెప్పారు. గురువారం నిర్వహించిన హుండీల ఆదాయం లెక్కింపును దేవదాయశాఖ ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మీ నరసింహారావు పర్యవేక్షించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బళ్ల రవి కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు పీడీఎస్‌ఓ రాష్ట్ర సర్వసభ్య సమావేశం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌ఓ) రాష్ట్ర సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం స్థానిక అల్లూరి సత్యనారాయణ భవనం (సీఐటీయూ కార్యాలయం)లో నిర్వహించనున్నట్టు ఆ సంస్థ జిల్లా కార్యదర్శి ఎస్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్, ప్రస్తుత ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్, అధ్యక్షుడు ఎన్ భాస్కర్ పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు విద్యార్థి ప్రదర్శన, వైద్య విద్యలో సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో సీట్ల అమ్మకానికి నిర్ణయించడంపై ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేయనున్నట్టు తెలిపారు.

విద్యార్థులకు డెస్కుల వితరణ


దాత విష్ణువర్ధన రావును సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం నగరానికి చెందిన విశ్రాంత ఇంజినీర్ చందన విష్ణువర్ధనరావు 30 డెస్కులను అందజేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధనరావు మాట్లాడుతూ పేద విద్యార్థులు కూడా అత్యుత్తమ విద్య ద్వారా ఉన్నత స్థానాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ డెస్కులు కావాలని విష్ణువర్ధనరావును అడిగిన వెంటనే సానుకూలంగా స్పందించి రూ.2.7 లక్షల విలువైన డెస్కులు అందించడం ఆయన ఔదార్యానికి నిదర్శనమన్నారు. దాతల ఆశయాల మేరకు విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దాత విష్ణువర్ధనరావును దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వి.వెంకటరావు, ఎం కృష్ణ చైతన్య, టీవీ దుర్గా ప్రసాద్, సీపీడీసీ సభ్యుడు ఎల్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఇ.రఘుబాబు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ద్వారకాతిరుమల : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వాహన పూజల పురోహితుడు సాతులూరి శ్రీనివాసాచార్యులు కుటుంబానికి శ్రీవారి దేవస్థానం పురోహితులు, దేవస్థానం సిబ్బంది రూ.72 వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ నగదును ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు చేతులమీదుగా శ్రీనివాసాచార్యులు భార్యకు గురువారం అందించారు. రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసాచార్యులు మృతి చెందడం చాలా బాధాకరమని రమణరాజు ఈ సందర్భంగా సంతాపం వ్యక్తం చేశారు.

ఎంపీ శ్రీధర్ పరామర్శ

లింగపాలెం : లింగపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత చిలుకూరి రఘునాథ్‌రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. గురువారం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ లింగపాలెంలో రఘునాథ్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మేడవరపు ఆశోక్, లింగపాలెం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కొఠారి మోహన్ ఉన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు


రామశింగవరం, వేగివాడ జగనన్న కాలనీల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలు

పెదవేగి : కారు చీకటిలో ఇబ్బందులు పడుతున్న జగనన్న కాలనీ వాసుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాలతో అధికారులు విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు. పెదవేగి మండలం రామసింగవరం, వేగివాడలోని జగనన్న కాలనీల్లో విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామని గృహ లబ్ధిదారులు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిని కలిసి విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రామసింగవరం, వేగివాడ జగనన్న కాలనీల్లో విద్యుత్ శాఖ సిబ్బంది వీధి దీపాలను గురువారం ఏర్పాటు చేయించారు. అడిగిన వెంటనే తమ సమస్యను పరిష్కరించినందుకు, రెండు గ్రామాల జగనన్న కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి కతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

వ్యాయామ కళాశాల విద్యార్థులకు అవార్డుపై అభినందన


ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నత్తానియేలు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల విద్యార్థులు క్రమశిక్షణతో నిరంతర సాధన చేసి కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకోవడం అభినందనీయమని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేల్ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల విద్యార్థుల ప్రదర్శనకు మొదటి స్థానం రావడం, కలెక్టర్ రూ. 15 వేలు నగదు బహుమతి, జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేయడం గర్వకారణమన్నారు. గురువారం కళాశాలలో ప్రిన్సిపల్ ఎస్.నత్తానియేలు, వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్యామల, ఫిజికల్ డైరెక్టర్లు రమేష్, విజయలక్ష్మి, విద్యార్థులను అభినందించారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం


బదిలీపై వెళ్లిన అప్పారావును సత్కరిస్తున్న సర్పంచ్ మద్దాల వాణి, ఉపాధ్యాయ బృందం


బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెదవేగి : ఉద్యోగులకు బదిలీలు సాధారణమని, ఎక్కడ పని చేసినా ఆ ప్రాంత ప్రజల ఆదరాభిమానాలు పొందడంలో ఉద్యోగి నడవడిక కీలకమని ఎంఈఓ సీహెచ్ బుద్ధవాస్ అన్నారు. గురువారం కవ్వగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుదీర్ఘ కాలం పనిచేసి ఇటీవల చేపట్టిన టీచర్ల బదిలీల్లో మొగల్తూరు మండలానికి బదిలీ అయిన ఎ.అప్పారావును పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి సర్పంచ్ మద్దాల వాణి, పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ పవన్, పెదవేగి ఎంఈవో సీహెచ్ బుద్ధవాస్ హాజరయ్యారు. వక్తలు అప్పారావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎ నిర్మల, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతగల ఉద్యోగికి సమాజంలో గుర్తింపు

గణపవరం (నిడమర్రు): బాధ్యతతో కష్టపడే పడే ప్రతి ఉద్యోగికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని జల్లికొమ్మర ప్రీహైస్కూల్ హెచ్‌ఎం కె.టి సుందరకుమార్ అన్నారు. ఆపాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఎం. నోబుల్ వాణి, ఎస్‌ఎన్. శ్రీనివాసరావు, వై.పెద్దిరాజు, కె. అపర్ణను గురువారం సహఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ టీచర్స్ పి.సౌజన్య, ఎల్. ప్రసాదరావు బదిలీ అయిన ఉపాధ్యాయుల సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ లీలాగోపాల్, శ్రీదేవి, పార్వతి, సరస్వతి, ఎం.రమేష్, ఐ.రమేష్ బాబు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

పెదపాడు: మండలంలోని ఉప ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్‌స్టేషన్లను పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు పరిశీలించారు. గురువారం పాతముప్పర్రు, వీరమ్మకుంట గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను వారు పరిశీలించి అక్కడ ఏర్పాట్లు పర్యవేక్షించారు. విద్యుత్, తాగు నీరు, పోలింగ్ అధికారులకు వసతి ఏర్పాటు చేయాలని స్థానిక పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని పోలింగ్ నిర్వహించనున్న గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు అమలులో ఉంటుందన్నారు. ఆయన వెంట స్థానిక వీఆర్వోలు ఉన్నారు.

రహదారి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- వంగాయగూడెం –పెరికీడు రహదారి పరిశీలన


వంగాయగూడెం- పెరికీడు రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: మండలంలో చేపడుతున్న ఆర్‌అండ్‌బీ రహదారి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధికారులు, కాంట్రాక్టరును ఆదేశించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ డీ జాన్‌మోషేతో కలిసి గురువారం రూ.50కోట్ల ఎన్‌డీబీ నిధులతో చేపడుతున్న వంగాయగూడెం–పెరికీడు రహదారి పనులను ఆయన పరిశీలించారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గండిచెరువు గట్టు వరకు 500మీటర్ల సీసీ రహదారిని కాలినడకన వెళ్లి ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత డ్రెయినేజీల నిర్మాణం చేడపతామని చెప్పారు. అనంతరం తోటగూడెంలో రహదారిని ఆయన పరిశీలించారు. అనంతరం వసంతవాడలో గ్రామస్తులతో మాట్లాడారు. రహదారి అధ్వానంగా ఉండటంతో పెరికీడు, పెదపాడు వెళ్లలేని స్థితిలో రహదారులు ఉన్నాయని వాటిని వీలైనంత త్వరగా అభివృద్ధిచేయాలని గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యనారాయణ కోరారు. వెంటనే రహదారులు భవనాలు శాఖ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని వారికి సూచించారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ ఈఈ వైవీ కిశోర్ బాబు, ఏఈ శేషుబాబు, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, పెదపాడు కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ఆక్కినేని రాజశేఖర్, కడిమి గోవిందరావు, పెదపాడు సర్పంచ్ కొత్తూరు జీవనకుమారి వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో.. సమస్యలు పరిష్కారం

పెదవేగి : ప్రజా దర్బార్ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దెందులూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై ప్రజా దర్బార్ నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజాప్రతినిధులు, ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పాతూరు రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు

- 18 నుంచి 24వ తేదీ వరకు గేటు మూసివేత

భీమడోలు: సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు రైల్వే ట్రాక్‌ను ఈనెల 18వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి ఈనెల 24వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలకు అత్యవసర మరమ్మతుల కారణంగా గేటు మూసి వేస్తున్నట్లు రైల్వే శాఖ అధికారులు గురువారం తెలిపారు. దెందులూరు, భీమడోలు రైల్వే స్టేషన్ల మధ్య లెవెల్ క్రాసింగ్ నం.358లోని పాతూరు రైల్వే ట్రాక్‌కు మరమ్మత్తులు చేపడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో గేటును మూసి వేస్తున్నామన్నారు. రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రత్యామ్నాయ రహదారులు భీమడోలు, గుండుగొలను వైపుగా రాకపోకలు సాగించాలని వారు కోరారు.

ఆధారాలు లేకుండా నగదు తరలింపు

- రూ.67,40,210 స్వాధీనం

పెదపాడు: ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 67,40,210 నగదును పెదపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజమండ్రి నుంచి చెన్నైకు వెళ్తున్న ప్రయివేటు ట్రావెల్స్ బస్సులో ఓ ప్రయాణికుడి వద్ద నగదు ఉన్నట్లు గుర్తించారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో అతని నుంచి ఆ నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు.

డీఈఎల్ఈడీ పరీక్షకు 164 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఈఎల్ఈడీ 3వ సెమిస్టర్ పరీక్షలు, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. సెమిస్టర్ పరీక్షలకు 148 మంది విద్యార్థులకు 145 మంది హాజరుకాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. సప్లిమెంటరీ పరీక్షకు 70 మందికి 19 మంది హాజరు కాగా 51 మంది గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ తెలిపారు.

ఆర్థిక క్రమశిక్షణతోనే స్వావలంబన


భీమడోలులో ఆర్థిక లావాదేవీలు, నిబంధనలను వివరిస్తున్న ఏపీఎం పి.సురేష్‌కుమార్

భీమడోలు: మహిళల ఆర్థిక క్రమశిక్షణ ద్వారానే కుటుంబాలు ఆర్థిక స్వావలంబన సాధిస్తాయని ఏపీఎం పి.సురేష్‌కుమార్ అన్నారు. భీమడోలు మండల సమైఖ్య కార్యాలయంలో గురువారం డ్వాక్రా సంఘాల ఆర్థిక లావాదేవీలు, ఆర్థిక వ్యవహారాల నిబంధనలపై గ్రామ సంఘాల ప్రతినిధులకు ఒక రోజు అవగాహన సదస్సును నిర్వహించారు. ఏపీఎం పి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళ సాధికారతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, వాటిన్నింటినీ సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టిని సాధించాలన్నారు. మహిళలు పొదుపును అలవర్చుకుని కుటుంబాలకు ఆర్థిక శక్తిగా మారాలన్నారు. సంక్షేమ పథకాల ద్వారా మహిళల వ్యక్తిగత ఖాతాలకు జమ అయ్యే నగదుతో చిన్న దుకాణాలను ఏర్పాటు చేసుకుని మరింత ఆర్థికంగా ఎదగాలన్నారు. లక్షలాది రూపాయలు లావాదేవీలు చేస్తున్న మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థిక అక్షరాస్యతల అవశ్యకతపై వారికి అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలోని డ్వాక్రా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత గ్రామ సంఘాల ప్రతినిధులపై ఉందన్నారు. తొలుత డీఎం జీవీ గోపి ప్రొజెక్టర్‌పై ఆర్థిక అక్షరాస్యత, లావాదేవీల తదితర అంశాలపై అవగాహన కలిపంచారు. సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి లక్ష్యంగా కృషి చేయాలి


భవిత కేంద్రంలో దివ్యాంగులకు పండ్లు, రొట్టెలు, పోషకాహారాన్ని అందిస్తున్న మానవత సభ్యులు

భీమడోలు: ప్రపంచ శాంతి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. మానవత సేవా సంస్థ ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా గురువారం పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోని 100 మంది రోగులు, గర్భిణులు, భవిత కేంద్రంలోని దివ్యాంగులకు రొట్టెలు, పండ్లు, బిస్కెట్లు, పోషకాహార పదార్థాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సామాజిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి సూపరింటెంటెంట్ సునీత అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చింతా శ్రీరామ చంద్రమూర్తి, పూర్వపు అధ్యక్షుడు అప్పక రాంబాబు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ వారోత్సాలను ఈనెల 22వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈనెల 19న భీమడోలు మొక్కలు నాటనున్నట్టు తెలిపారు. పంచకర్ల సత్యనారాయణ, టీవీ ఉమామహేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు సచివాలయాల కన్వీనర్ల సమావేశం

గణపవరం(నిడమర్రు): గణపవరం కేవీపీ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నియోజకవర్గ స్థాయి గ్రామ సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రతినిధులు రవి, సుభాష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని మాట్లాడతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి గ్రామ, మండల సచివాలయ కన్వీనర్లతోపాటు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాల్గోవాలని కోరారు. సచివాలయ కన్వీనర్లు తమతోపాటు వారి ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి


భీమడోలులో ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ


పోలసానిపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఎన్నికల స్టేజ్ 2 అధికారిణి జీవన సంధ్య

భీమడోలు: పోలసానిపల్లిలోని ఉప ఎన్నిక ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎన్నికల సిబ్బందికి భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ అన్నారు. భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఈనెల 19న నిర్వహించనున్న పోలసానిపల్లి 12వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి ఓటింగ్ ప్రక్రియ, ఎన్నికల నియమ నిబంధనలపై ఎన్నికల సిబ్బందికి ఎన్నికల విధులపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలసానిపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, స్టేజ్ 2 అధికారిణి జీవన సంధ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు సున్నితమైన అంశమని, ఎన్నికల విధులు నిర్వర్తించే తరుణంలో నిబంధనలు విధిగా పాటించాలన్నారు. 12వ వార్డులోని 272 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈనెల 18న పోలసానిపల్లి -2 పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి మెటీరియల్‌ను పంపుతామన్నారు. ఈనెల 19వ తేదీ శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలకు వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు. ఎన్నికల సిబ్బంది రాజకీయాలకుతీతంగా పని చేయాలన్నారు. జిల్లా డీపీవో కార్యాలయం నుంచి వచ్చిన బ్యాలెట్ పత్రాలను భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సింహాద్రి, టీచర్లు ఎం.శరీన్, జే.వసంత, పీవో, ఏపీవో, ఓపీవోలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పోలసానిపల్లి పాఠశాలలో పోలింగ్‌కు ఏర్పాట్లు

భీమడోలు: పోలసానిపల్లి 12వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి పోలింగ్ కేంద్రంగా ఉన్న పోలసానిపల్లి-2 పాఠశాలకు ఈనెల 18, 19వ తేదీలు సెలవులు ప్రకటించినట్లు ఎంఈవో ఈడ్పుగంటి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. డీఈవో శ్యాం సుందర్ ఆదేశాల మేరకు మిగిలిన 1, 3 పాఠశాలలు యథావిధిగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈనెల 18వ తేదీ శుక్రవారం పోలింగ్ సామగ్రిని కేంద్రానికి తరలించి ఏర్పాట్లు చేస్తారని, 19వ తేదీ శనివారం పోలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. వార్డు పరిధిలోని ఓటర్లంతా ఈ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని అన్నారు.